# కదిల్తే నేరం..నలుగురు కలిస్తే నేరం?

ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీముందున్న ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రాంతాల పోలీసుబిల్లు చాలా విచిత్రమయిన పత్రం. చాలా విచిత్రమయినది మాత్రమేకాదు, చాలా రకాలుగా విచిత్రమయినది.

మొదటి విచిత్రంఏమిటంటేఈ బిల్లుకు పోలీసుల ప్రధాన కర్తవ్యమయిన నేరవిచారణతో ఎటువంటి ప్రమేయం లేదు. పోలీసు యంత్రాంగానికి అదనంగా అధికారాలిచ్చే చట్టాన్ని ప్రభుత్వం తయారుచేస్తోందంటే, అది నేరవిచారణనూ నేరాల పరిష్కారాన్ని త్వరితం చేయడానికో లేక మరింత సమర్థవంతం చేయడానికో ఉద్దేశించిందని ప్రజలు భావిస్తారు. కాని ఈ బిల్లుకు నేరవిచారణతో గాని, పరిష్కారంతోగాని సంబంధం లేదు.

బిల్లును సొంతం చదివితే, దాని ముఖ్య ఉద్దేశం సామాజిక శాంతిభద్రతలను (ఇంగ్లీష్‌లో 'ఆర్డర్') పరిరక్షించడం అని అర్థమవుతుంది. కొన్ని పట్టణాలలో (ప్రస్తుతానికి విజయవాడ, విశాఖపట్టణాలు. కాని, ప్రభుత్వం తలచుకొంటే —సెక్షన్ 1(2)ప్రకారం —ఏ పట్టణమయినా కావచ్చు) విపరీతంగా జనాభా పెరిగిపోతున్న కారణంగా శాంతిభద్రతల నిర్వహణకు ఉత్పన్నమవుతున్న ఆటంకాలను తొలగించడానికి ఈ బిల్లును తయారుచేసినట్లు హోంమంత్రి లక్ష్యప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడగూడ మరొక అపోహకు తావుంది. పెరిగిపోతున్న జనాభావల్ల గూండాయిజం తదితర సంఘవ్యతిరేక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయేమో, వాటిని అదుపుచేయడం కోసం ఈ చట్టం అవసరమయిందేమో అనుకోవచ్చును. కాని బిల్లును ఒక్కసారు చదివితేచాలు, ఇది గూడా వాస్తవం కాదని తెలిసిపోతుంది.

ఇక, రెండవ విచిత్రం. ఈ బిల్లు ఉద్దేశం నేరవిచారణను సమర్థవంతంచేయడం కానట్టే, సంఘ వ్యతిరేక గూండా కార్యకలాపాలను అరికట్టడం కూడా కాదు. ఈ బిల్లులో చెప్పిన 'శాంతిభద్రత' పరిరక్షణకు అర్థం అదికాదు. ఈ బిల్లు ఉద్దేశం (అంటే మేము ఊహిస్తున్నది కాదు, ప్రకటిత లక్ష్యం) సాధారణ పౌరజీవితాన్నీ, ప్రజాస్వామిక కార్యకలాపాలనూ నియంత్రించడం. సినిమాల దగ్గర, సర్కస్‌ల దగ్గర, పార్కులలో, వీధులలో బారులలో, గొరడీవాడిదగ్గర, నృత్యగాన నాటక ప్రదర్శనల దగ్గర, రాజకీయ పార్టీల బహిరంగ సభల దగ్గర, ధర్నాలు, పికెటింగ్‌లు ప్రదర్శనల ఊరేగింపులు తదితర ప్రజాస్వామిక నిరసన కార్యక్రమాలు జరిగే స్థలాలదగ్గర, గుమిగూడే సామాన్యప్రజల (గూండాలుకాదు) నడవడికను నియంత్రించడం ఈ బిల్లు ఉద్దేశం. ప్రజల వైయ్యక్తిక జీవితాన్ని వాళ్ల ఇష్టాయిష్టాలకు వదిలేసి, వాళ్ల సామాజిక పౌరజీవితాన్ని దిగ్బంధనం చేయడం ఈ బిల్లు లక్ష్యం. ఈ బిల్లులోని ఒక్కొక్క సెక్షన్ చదువుతూంటే మన పాలకుల మనస్తత్వం ఎటువంటిదా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఒకమనిషి ఇంటినుండి బయటికి వచ్చిన క్షణం నుండి అతన్ని వేయికళ్లతో కనిపెట్టాలి, అతను నలుగురితో గుమిగూడినా, మూత్రం చేయడం కోసం రోడ్డుపక్కకు పోయినా అతని ప్రతీ కదలికనూ నియంత్రించాలి అనే ఆరాటం ఈ బిల్లుకు ప్రోద్బలాన్ని ఇచ్చింది. బిల్లులోని 54 సెక్షన్లలో 16 సెక్షన్లు పోలీసు యంత్రాంగం నిర్వహణకు సంబంధించినవి, 12 సెక్షన్లు నేర నిరోధానికి సంబంధించినవి, కాగా మిగిలిన 26 సెక్షన్లు పౌర జీవితాన్ని దిగ్బంధనం చేసేవే. సామాన్య ప్రజల అత్యంత సామాన్య కార్యకలాపాలు మనపాలకులకు 'శాంతిభద్రతల సమస్య'గా కనబడడం మొదలయిందని అనుకోవాలి. ఇప్పటికే ఈ చట్టంలేకుండానే— విజయవాడ పట్టణంలో వేడుకలు జరుపుకోవాలన్నా, తీర్థాలప్పుడు నదిలో స్నానం చేయాలన్నా, పందిళ్లువేసి చలివేంద్రం పెట్టాలన్నా, రోడ్లమీద నడవాలన్నా రిక్షాతొక్కాలన్నా (ఇక సభలూ, సమావేశాలూ మొదలయిన ప్రజాస్వామిక కార్యకలాపాల గురించి చెప్పాలా?) పోలీసుల అనుమతితోనే, వాళ్ళు నిర్దేశించిన పద్ధతిలోనే, జరగాలి. ఇక ఈ బిల్లు చట్టమయితే రాబోయే పరిస్థితిని ఊహించుకోవలసిందే. బిల్లు లక్ష్యాలను వివరిస్తూ హోంమంత్రి చెప్పిన వాక్యాలు ప్రభుత్వం ఉద్దేశాన్ని స్పష్టంచేస్తాయి. విజయవాడలో, విశాఖపట్నంలో నేరాలు పెరిగిపోతున్నాయనిగాని, అపరిష్కృతంగా ఉండిపోతున్నాయనిగాని, గూండాల సంఘవ్యతిరేక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయనిగాని ఆయన అనలేదు.

మూడవ విచిత్రం ఏమిటంటే ఈ బిల్లుకు నమూనా ప్రస్తుతం హైదరాబాద్‌లో అమలులోవున్న హైదరాబాద్ నగర పోలీసు చట్టం. ఈ చట్టాన్ని నిజాం జమానాలో 1937 లో తయారుచేశారు. అదే ఇప్పటికీ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. 1937 గడచిన తరువాత 1950 లో మనదేశానికి ఒక రాజ్యాంగం వచ్చింది. అంతకుముందులేని ప్రాథమిక హక్కులను రాజ్యాంగం గుర్తించింది. ఆర్టికల్ 19లో అందరికీ వాక్‌స్వాతంత్ర్యం, సభాస్వాతంత్ర్యం, అభిప్రాయ స్వేచ్ఛ, నివాసస్వేచ్ఛ, సమావేశస్వేచ్ఛ, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ ఉన్నాయని గుర్తించింది. ఆర్టికల్ 21లో ఎవ్వరి ప్రాణాన్ని గాని స్వేచ్ఛనుగాని చట్టం నిర్దేశించిన పద్ధతిలోతప్ప ఇతరత్రా తీసివేయడానికి వీలులేదని హామీయిచ్చింది. ఈ ప్రాథమిక హక్కులకూ అవిలేని కాలంలో తయారయిన హైదరాబాద్ నగర పోలీసు చట్టానికీ పొంతనవుందో లేదో రాజ్యాంగాన్ని సంరక్షించవలసిన మన పాలకులు ఎన్నడూ ఆలోచించలేదు. ఇప్పుడు ఆ చట్టాన్ని రాష్ట్రమంతటికీ వ్యాపింపజేస్తున్నారు. పైగా దాన్ని మరింత నిరంకుశం చేశారు. ఈ పట్టణప్రాంతాల పోలీసు బిల్లులో అదనంగా ఉన్న విషయాలు ఏమిటంటే పోలీస్ కమిషనర్ ఏ భవన్నయినా ఇతర స్థలాన్నయినా తాత్కాలికంగా స్వాధీనం చేసుకొని అక్కడికి ప్రవేశించడానికి వీలులేదని ఏ వ్యక్తినయినా ఆదేశించవచ్చును. అంతేకాక, నగరంలో ఏ ప్రాంతంలోనయినా పోలీస్ కమిషనర్ 'ఎమర్జెన్సీ' ప్రకటించి ఏ వ్యక్తినయినా అక్కడినుండి బహిష్కరించవచ్చును. ఈ అదనపు అధికారాన్ని ఒకపక్క ఇస్తూ వేరొకపక్క పోలీసుల అక్రమ ప్రవర్తనకు ఎటువంటి శిక్షా లేకుండా చేశారు. హైదరాబాద్ నగర పోలీసు చట్టంలో సెక్షన్ 19 ఉంది. దానిప్రకారం ఏ పోలీసు అధికారి అయినా అక్రమంగా ఒక ఇంట్లోకి ప్రవేశించినా ఒకవ్యక్తిని నిర్బంధించినా ఒకరి ఆస్తిని స్వాధీనం చేసుకున్నా నిర్బంధితుడి మీద అనవసరంగా హింసప్రయోగించినా అతనికి ఆరునెలలవరకు జైలుశిక్ష వేయవచ్చును. ఇప్పుడు కొత్తగా తయారవుతున్న పట్టణ ప్రాంతాల చట్టంలో ఈ సెక్షన్‌లేదు. లేకపోవడమేకాక, సెక్షన్ 53(1) ప్రకారం ఈ చట్టం కింద చిత్తశుద్ధితో పోలీసులు తీసుకున్న ఏ చర్యకూ శిక్షవుండదని అన్నారు. అంటే ఎటువంటి దురుద్దేశమూ లేకుండా చిత్తశుద్ధిలో ఒకవ్యక్తిని లాకప్పులో కొట్టిచంపేసినా శిక్షవుండదన్నమాట! మరి, అందరికీ జీవించే హక్కువుందని భరోసాయిచ్చే ఆర్టికల్ 21 ఏమయిందో? ఈ బిల్లు పోలీసులకు అసాధారణమయిన అధికారాలు ఇస్తుంది.

సెక్షన్ 10: పోలీస్ కమిషనర్ ఏ వ్యక్తికయినా ''నువ్వు బహిరంగంగా పాటలుపాడడానికి, దిష్టిబొమ్మలు బహిరంగ స్థలాలలో తగలబెట్టడానికి, రెండువర్గాలమధ్య లేక వ్యక్తులమధ్య విద్వేషం రెచ్చగొట్టే పద్ధతిలో ఉపన్యాసం ఇవ్వడానికి గాని, చిత్ర ప్రదర్శన నిర్వహించడానికిగాని, సంకేతాలు ప్లేకార్డులు ప్రదర్శించడానికి గాని, సైగలుచేయడానికిగాని వీలులేదు'' అని ఆజ్ఞ చేయవచ్చును. సాధారణప్రజాస్వామిక కార్యక్రమాలకు ఇది ఎటువంటి ఆటంకమో వివరించనక్కరలేదు. ఆర్టికల్ 19 (ఎ)లోని ప్రాథమిక హక్కులను ఈ సెక్షన్ ఒక్కదెబ్బతో వెనక్కి తీసుకుంటుంది.

సెక్షన్ 12: పోలీస్ కమిషనర్ ఏ భవనాన్నయినా లేక బహిరంగ స్థలాన్నయినా తాత్కాలికంగా 'స్వాధీనం' చేసుకొని ఏ వ్యక్తినయినా అక్కడికి ప్రవేశించడానికి వీలులేదని ఆర్డర్ జారీ చేయవచ్చును. అంటే ఒక ప్రతిపక్ష పార్టీగాని ప్రభుత్వాన్ని వ్యతిరేకించే ఏ ఇతర సంస్థగాని ఒకచోట సభ లేక సమావేశం జరుపుకోవాలని అనుకుంటే పోలీస్ కమిషనర్ ఆ స్థలాన్ని అది ఇల్లే అయినా స్వాధీనం చేసుకొని ఆ పార్టీ లేక సంస్థ బాధ్యులను ఆ దరిదాపులకు రానడానికి వీలులేదని ఆర్డర్ జారీ చేయవచ్చును.

సెక్షన్ 15: నలుగురు వ్యక్తులు సమావేశమయిన చోట— అది బహిరంగస్థలం కానక్కరలేదు, హాలుకావచ్చు— శాంతిభద్రతలు నెలకొల్పడానికి పోలీసులు నిరాటంకంగా ప్రవేశించవచ్చును. ఒక హెడ్ కానిస్టేబిల్ సహితం తనకు న్యాయమని తోచిన ఎటువంటి ఆజ్ఞ అయినా జారీచేయవచ్చును. దానిని అందరూ ఆమోదించితీరాలి. అంటే సమావేశం ముగించుకొని వెళ్లిపొమ్మన్నా వెళ్లిపోవాలి. అతని ఆజ్ఞ అన్యాయం అనిపిస్తే ఎవరికయినా ఫిర్యాదు చేసుకోవచ్చునని గూడా బిల్లులో లేదు. అంటే ఫిర్యాదుకు తావులేదన్నమాట.

సెక్షన్ 16(1): ఒక వ్యక్తివలన శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని పోలీస్ కమిషనర్ భావిస్తే అతన్ని ఫలాన విధంగా నడుచుకొమ్మనిగాని లేదా ఈ ప్రాంతాన్ని వదిలిపెట్టి వేరేప్రాంతానికి వెళ్లిపొమ్మనిగాని ఆదేశించవచ్చును.

సెక్షన్ 16(3): ఏ వ్యక్తి అయినా కొన్ని నిర్దేశించబడ్డ నేరాల క్రింద రెండుసార్లు శిక్ష అనుభవించివుంటే పోలీస్ కమిషనర్ అతన్ని నగరంనుండి బహిష్కరించవచ్చును. (వేరే ఊరికి పోయి నేరాలు చేయమనా?) నేరం చేసినందుకు కోర్టు ఆ వ్యక్తికి శిక్షవేసింది. అతను శిక్ష అనుభవించాడు. శిక్ష అనుభవించిన తరువాత ఇప్పుడు పోలీసు కమిషనర్ నగర బహిష్కరణ శిక్షవేస్తాడు. అంటే పోలీస్ కమిషనర్ న్యాయమూర్తిని మించిన న్యాయమూర్తి అన్నమాట.

పై రెండు విధుల నిర్వహణలో, నిర్బంధానికి గాని బహిష్కరణకుగాని గురయినవ్యక్తి అరెస్టు, కస్టడీ, జామీనుల విషయంలో కోర్టుకు ఉండే అధికారాలన్నీ పోలీస్ కమిషనర్ కు ఉంటాయని సెక్షన్ 16(7) అంటుంది. ఆధునిక ప్రజాస్వామ్యాలలో కార్యనిర్వహణశాఖ (ఎగ్జిక్యూటివ్), న్యాయశాఖ (జుడిషియరీ) వేరువేరుగా ఉండాలి అనే మౌలికమయిన సూత్రానికి ఇది వ్యతిరేకం. ఈ విధంగా పోలీస్ కమిషనర్‌కు న్యాయమూర్తి అధికారాలిచ్చే సెక్షన్లు బిల్లులో చాలావున్నాయి.

అయితే సామాన్యప్రజలను విపరీతంగా వేధింపుకు గురిచేసేవి సెక్షన్ 34 నుండి 41 దాకా ఉన్న అంశాలు. ఈ సెక్షన్లలో చిన్నచిన్న తప్పిదాలన్నిటినీ నేరాలుగా మార్చి 50 నుండి 500 రూపాయలదాకా జుర్మానా నిర్దేశించారు.

సారాంశంలో చెప్పాలంటే నేరవిచారణం చేయడం, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంకంటే ప్రజల దైనందిన పౌరజీవితాన్ని, ప్రజాస్వామిక కార్యకలాపాలను నియంత్రించే లక్ష్యాన్ని ప్రధాన ఉద్దేశంగాగల బిల్లు ఇది. బిల్లును ప్రవేశపెట్టిన హోంమంత్రిగారు బిల్లుచివర ఈ వాక్యాన్ని చేర్చివుంటే సమంజసంగా ఉండేది. ''ఈ బిల్లులోని మినహాయింపులకు లోబడి పట్టణప్రాంత తెలుగుప్రజానీకం రాజ్యాంగంలోని సకల ప్రాథమిక హక్కులను నిరాటంకంగా అనుభవించవచ్చును''.

9-11-85 —బి.జి.కె.